క్లుప్తంగా

నేడు 'వేమూరు' అభివృద్ధిపై సమీక్ష

వేమూరు: జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జిల్లాస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ప్రత్యేకాధికారి బొంత అర్జునరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేమూరు నియోజకవర్గం అభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా, డివిజినల్, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని ఆయన తెలిపారు.

పంచాయతీ చొరవతో బస్టాండులో గుంతలకు మోక్షం



భట్టిప్రోలు: భట్టిప్రోలు బస్టాండు సెంటరులో గుంతల మరమ్మతులకు పంచాయతీ అధికారులు, పాలక వర్గం సభ్యులు చర్యలు చేపట్టారు. చాలా కాలంగా ఇక్కడ గుంతలు ఏర్పడినా ఆర్అండ్బీ అధికారులు పట్టించుకోకపోవడంతో గురువారం వాటిని కాంక్రీట్ మిక్సర్తో పూడ్పించారు. కార్యదర్శి కోట శ్రీనివాసరావు పనులను పర్యవేక్షించారు. ఇందుకు పంచాయతీ సభ్యులు గోలి సుధా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం కార్యదర్శి పీజీ అరుణ్శాస్త్రి, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సలీమ్, వైఎస్సార్ సీపీ కార్యదర్శి మోర్ల కోటేశ్వరరావు, సహాయ సహకారాలు అందించారు.

అడెమ్మ వారికి ప్రత్యేక పూజలు



అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు గ్రామ పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి గ్రామదేవత అడెమ్మ అమ్మవారిని గురువారం కాపు సంఘీయులు సామూహికంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మేళ తాళాలు, కనక తప్పెట్లతో తరలి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. పంటలు బాగా పండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి



బాపట్ల: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమా లీలా కృష్ణ పేర్కొన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ హైస్కూలులో విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీలా కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని చెప్పారు. భారత రాజ్యాంగం చాలా గొప్పదని, చట్టాలను రాజ్యంగం ద్వారా పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన

పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రు విద్యుత సబ్ స్టేషన్ ఎదుట గురువారం రాత్రి గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. రాత్రి 8 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో అధికారులతో గ్రామస్తులు మాట్లాడారు. రాత్రి ఒంటి గంటకు విద్యుత్ వస్తుందని వారు చెప్పడంతో ఆందోళనకు దిగారు. రాత్రి వేళల్లో పిల్లలు, వృద్ధులు విద్యుత్ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. విద్యుత్ వెంటనే పునరుద్ధరించకపోతే.. ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. దీంతో రాత్రి 9:30 గంటలకు విద్యుత్ సరఫరా చేశారు. గ్రామస్తులు ఆందోళన విరమించారు.

అధిక ధరలను నియంత్రించాలి

రేపల్లె: నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించి, ప్రజలపై భారాన్ని తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ అన్నారు. ధరల నియంత్రణకు రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమర భేరిలో భాగంగా గురువారం పట్టణంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం ద్రవ్యోల్బణాన్ని అదుపులోకి తెచ్చి, పేద, మధ్య తరగతి ప్రజలకు నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసే శక్తినివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.ఆశీర్వాదం, కె.రమేష్, డి.బాబురావు, చిట్టిబాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి 'గడప గడపకు'

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు
- చినమట్లపూడి గ్రామ సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళ చెబుతున్న సమస్యలను వింటున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

నగరం: ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేవిధంగా చర్యలు చేపడుతున్నామని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. చినమట్లపూడి గ్రామ సచివాలయ పరిధిలోని ముస్లింపాలెం, పకీరావారిపాలెం, కత్తులవారిపాలెం, అద్దెపల్లివారిపాలెం, గొడపాలెం గ్రామాలలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పకీరావారిపాలెం గ్రామస్తులు శ్మశానవాటికకు వెళ్లే దారిని అభివృద్ధి పరచాలని, కత్తులవారిపాలెం గ్రామస్తులు ఇళ్ల స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్లను అందించి, పక్కా గృహాలు మంజూరు చేయాలని, పింఛన్లు రావడం లేదని ఎంపీ మోపిదేవి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన ఎంపీ కత్తులవారిపాలెం శ్మశాన వాటిక దారిని ఉపాధిహామీ పథకం కింద అభివృద్ధి పరచాలని, ఇళ్ల స్థలాల పొజిషన్ సర్టిఫికెట్లను త్వరితగతిన అందించాలని తహసీల్దారు శ్రీనివాసరావును ఆదేశించారు. గృహ నిర్మాణాలు, పింఛన్లు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్కు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో సంతోషంగా జీవిస్తున్నట్లు ప్రజలు చెబుతున్నారన్నారు. ఏ గడపకు వెళ్లినా తమకు సంక్షేమ పథకాల నగదు నేరుగా బ్యాంకు ఖాతాకు జమ అవుతున్నట్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో అర్హులైన ప్రతి ఒక్కరికీ అవినీతికి తావులేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డికి.. మరలా ప్రజలు పట్టం కడతారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎంపీ మోపిదేవి 600 గృహాలను సందర్శించి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, గ్రామ సర్పంచ్ షేక్ గుల్జార్, ఎంపీటీసీ జరీనా, వైఎస్సార్సీపీ నాయకులు అబ్దుల్ కరీం, ఇస్మాయిల్, కరిముల్లా, షేక్ ఆలీబుడ్డా, సుభాని తదితరులు పాల్గొన్నారు.

రక్షాబంధన్..



విద్యార్థులకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు



సోదరుడికి ఇలా..

భట్టిప్రోలు: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భట్టిప్రోలులోని పలు విద్యా సంస్థల్లో గురువారం విద్యార్థినులతో రాఖీలు కట్టించారు. స్థానిక గాయత్రి అకాడమీలో ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా అధ్యక్షుడు పి. మనోజ్ కుమార్ రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. గాయత్రి అకాడమి డైరెక్టర్ కొండముది షణ్ముఖ శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వరుణ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు సుబ్బారావు, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు. మండలంలో ఘనంగా రక్షా బంధన్ వేడుకలు నిర్వహించారు. శ్రావణ పౌర్ణమి(రాఖీ పౌర్ణమి) పురస్కరించుకుని రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. చెల్లెళ్లు అన్నలకు రాఖీలు కట్టారు. జీవితాంతం వారికి రక్షగా ఉంటామని అన్నలు ఆశీర్వదించారు.

సమస్యలపై కౌన్సిలర్ల ఏకరువు



అధికారులను ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు రామయ్య, లక్ష్మీలావణ్య, శిరీష



సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్పర్సన్ ఖలేదా నసీమ్

పనిచేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

తెనాలి అర్బన్: వార్డుల్లో సమస్యలపై పలువురు వైఎస్సార్ సీపీ, టీడీపీ కౌన్సిలర్లు ఏకరువు పెట్టారు. వాటిని పరిష్కరించాలని కోరడంతో పాటు అభివృద్ధి పనులు చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని గురువారం కౌన్సిల్ హాలులో చైర్పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ అధ్యక్షతన నిర్వహించారు. ముందు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, కాంట్రాక్ట్ నియామకాలకు సంబంధించిన ప్యానల్ కమిటీని ప్రకటించారు. ఇందులో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు కొమరబత్తిని జయపాల్, ఆవుల కోటయ్య, తిరుమలశెట్టి సామ్రాజ్యం ఉన్నారు. అనంతరం సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. అజెండాలోని 45వ అంశం చదవడం పూర్తి కాగానే, చైర్పర్సన్ ప్యానల్ కమిటీ సభ్యులుగా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు అన్నాబత్తుని పద్మజ, పెదలంక లక్ష్మీలావణ్య, షేక్ దుబాయ్ బాబు, పేరం సంజీవరెడ్డిని నియమిస్తున్నట్లు చైర్పర్సన్ ఖాలేదా నసీమ్ ప్రకటించారు. అనంతరం మిగిలిన నాలుగు అంశాలు చదవి ఆమోదించిన తర్వాత జీరో అవర్ నిర్వహించారు.

- 23,24,25 వార్డుల కౌన్సిలర్లు తోక శిరీష, పెదలంక లక్ష్మీలావణ్య, తాడిబోయిన రామయ్య మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు కాలనీలోని రాజీవ్ గృహకల్పలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని తెలిపారు. వ్యర్థాలు బయటకు వచ్చి దుర్గంధభరితంగా మారిందని, ప్రతిరోజు నివాసితులు తమ ఇళ్లకు వచ్చి ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. గత మున్సిపల్ కౌన్సిల్లో వెంటనే డ్రైనేజీని పునరుద్ధరిస్తామని చైర్పర్సన్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే, నేటి వరకు కాంట్రాక్టర్ పనులు చేయలేదని తెలిపారు. కాంట్రాక్టర్కు ఇప్పటికే రెండు నోటీసులు ఇచ్చినట్లు మున్సిపల్ ఇంజనీర్ నాగమల్లేశ్వరరావు వివరణ ఇచ్చారు. కాంట్రాక్టర్తో పనులు చేయించాలని, లేనిపక్షంలో అతడ్ని బ్లాక్ లిస్ట్లో పెట్టాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. దీనిపై చైర్పర్సన్ ఖాలేదా నసీమ్ కలుగజేసుకున్నారు. పనులు చేయని కాంట్రాక్టర్పై చర్యలతో పాటు త్వరగా డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు.
- 11వ వార్డు కౌన్సిలర్ కఠారి రత్నకుమారి మాట్లాడుతూ తన వార్డులో మంచినీటి పైపుల నుంచి మురుగు నీరు వస్తోందని, దాన్ని పరిష్కరించాలని కోరారు. మురుగునీరు రాకుండా చర్యలు తీసుకుంటామని ఏఈ చైతన్య హామీ ఇచ్చారు.
- తన వార్డులో బస్షాప్ ఏర్పాటు చేయాలని, లింగారావు ఇంటి సమీపంలో రోడ్లు, కాల్వలు నిర్మించాలని 27వ వార్డు టీడీపీ కౌన్సిలర్ బోయపాటి అరుణ కోరారు. రోడ్లు, కాల్వల ఏర్పాటుకు టెండర్లు పిలిచినట్లు చైర్పర్సన్ తెలిపారు.
- సమావేశంలో కౌన్సిలర్లు అన్నం పిన్నారావు, షేక్ ఇస్మాయేల్, ఆవుల కోటయ్య దోమలు, రోడ్లు, కాల్వల సమస్యల్ని ప్రస్తావించారు. వాటిని పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం సమావేశాన్ని ముగించినట్లు చైర్పర్సన్ ప్రకటించారు. సమావేశంలో కమిషనర్ ఎం. జశ్వంతరావు, అసిస్టెంట్ కమిషనర్ అనూష, పలువురు మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

గులాబీ రంగు పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలి

నిడుముక్కలలో పత్తిపంటను పరిశీలించిన శాస్త్రవేత్త డాక్టర్ శారద



పత్తి పంటను పరిశీలించి, రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

గుంటూరు రూరల్: పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణ చర్యలు చేపట్టాలని పత్తి పంట ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఒ.శారద తెలిపారు. గురువారం లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో పత్తి పంట పర్యవేక్షణ, గులాబి రంగు పురుగు నివారణపై రైతులకు క్షేత్రస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలోని పత్తి పంటను పరిశీలించారు. పంట పూత దశలో ఉందని, గులాబీ రంగు పురుగు ఉనికిని గుర్తించి, నివారణ చర్యల్లో భాగంగా ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రోజుకు 8 రెక్కల పురుగులను వరుసగా మూడు రోజులు బుట్టల్లో గుర్తించినట్లయితే గుడ్లపై పనిచేసే వేపగింజల కషాయం 5 శాతం, అజాడిరాక్టిన్ 3000 పీపీఎం, 600 మిల్లీ లీటర్లు గానీ, ప్రొఫెనోఫాస్ 40 మిల్లీ లీటర్లు గానీ ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. గుడ్డి పువ్వులను గుర్తించి, వాటిని పీకి నాశనం చేయాలని వివరించారు. పురుగుల ఉధ్రుతి ఎక్కువగా ఉన్నట్లయితే ఎకరానికి 15 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా పత్తిలో తామర పురుగులను, పచ్చదోమ ఉధ్రుతిని గమనించటం జరిగిందని, వీటి నివారణకు ఫ్రిఫోనిల్ 400 మిల్లీ లీటర్లు గానీ, ఫ్లోనికామయిడ్ 60 గ్రాములు కానీ ఎకరానికి తగిన నీటితో కలిపి పిచికారి చేయాలన్నారు. ఎసిఫేట్, మోనోక్రోటోఫాస్ మందులు రైతులు ఎక్కువగా వినియోగిస్తున్నారని చెప్పారు. వీటిని వాడినట్లయితే రసం పీల్చే పురుగు ఉధ్రుతి పెరుగుతుందని చెప్పారు. కాండం పూత విధానాన్ని రైతులకు వివరించారు. ఎల్బీజీ 904 రకం మినుము విత్తనాలను రైతులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మంగళగిరి ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏవో నరశింహులు, వీఏఏ రవి, రైతులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు న్యాయం చేయాలి

రేపల్లె: మోసపోయిన డ్వాక్రా మహిళలకు న్యాయం జరిగే వరకు పోరాటాలు కొనసాగిస్తామని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ అన్నారు. సీపీఎం, ఐద్వా ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, కమిషనర్ విజయసారథికి డ్వాక్రా మహిళలు గురువారం సమస్యను విన్నవించి, వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ డ్వాక్రాలో కొంతమంది సభ్యులు బ్యాంకు నుంచి ఎటువంటి రుణాలు పొందలేదని, ఇటీవల మహిళలు తీసుకోని రుణాలు చెల్లించాలంటూ బ్యాంకుల నుంచి నోటీసులు వచ్చాయన్నారు. విచారణలో వారి పేర్లతో కొంతమంది బ్యాంకర్లతో లాలూచీ పడి రుణాలు పొందారన్నారు. మహిళల పేర్లతో రుణాలు పొందిన వారిని, అక్రమ రుణాలు అందించిన బ్యాంకర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమాలకు మెప్మా ఆర్పీలు, బ్యాంకర్లపై ఇటువంటి ఘటనలకు పాల్పడకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన చైర్మన్ మంగ మాట్లాడుతూ విచారణ చేపట్టి, సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రేపల్లె పట్టణ అధ్యక్షురాలు షేక్.జహీదా, కార్యదర్శి షేక్.ఆశ, డ్వాక్రా మహిళలు షబానా సుల్తానా, గౌసే, నాంచారమ్మ పాల్గొన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి మృతి

రేపల్లె రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని 8వ వార్డులో చోటుచేసుకుంది. పట్టణ సీఐ నజీర్బేగ్ వివరాల మేరకు తాలూకా సెంటరులో ఓలేటి మహేష్(25) అనే వ్యక్తి మొబైల్ ఫోన్ మెకానిక్గా పనిచేస్తూ.. జీవిస్తున్నాడు. కుటుంబ సభ్యులతో మాటపట్టింపు రావటంతో మనస్తాపానికి గురైన బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్కు ఉరి వేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు మహేష్ను ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

తెనాలి రూరల్: అనారోగ్య సమస్యలతో ఆత్మహత్యాయత్నం చేసిన ఆటో డ్రైవర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ నాజరుపేటకు చెందిన ఆటో డ్రైవర్ గండికోట కిశోర్(43) కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల ఆగస్టు 27న గడ్డిమందు కొని తాగాడు. తొలుత కుటుంబ సభ్యులు తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం కిశోర్ మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్టౌన్ సీఐ కె. చంద్రశేఖర్ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలి

రేపల్లె: మండలంలోని పెనుమూడిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న అక్రమ ఇసుక రవాణాను నిలుపుదల చేయాలని జై గౌడ్ ఉద్యమ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాసరావు కోరారు. పెనుమూడిలో ఇసుక తరలిస్తున్న ప్రాంతాన్ని గురువారం ఆయన పరిశీలించి, నిరసన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి ఇసుక రవాణా అడ్డుకోకుంటే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

శిక్షణతో నైపుణ్యాలకు పదును

యనమదల (ప్రత్తిపాడు): నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకునేందుకు శిక్షణలు దోహదపడతాయని జీఈసీ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. మండల పరిధిలోని యనమదల గుంటూరు ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం 2023 ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఒరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు యూనివర్శిటీ సిలబస్తో పాటు ఇంటర్న్షిప్ ప్రోగ్రాం, ఇండస్ట్రియల్ శిక్షణల్లో కూడా పాల్గొని, మంచి నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలని సూచించారు. గత సంవత్సరం తమ కళాశాల విద్యార్థులు ప్రముఖ ఎంఎన్సీ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. కళాశాల సెక్రటరీ కోయి శేఖర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యనభ్యశిస్తూ..తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. కళాశాల డైరెక్టర్ గోగినేని సాంబశివరావు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె. రామకోటయ్య మాట్లాడుతూ ఇంజినీరింగ్ నందు విరివిగా ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. మొదటి సంవత్సరం నుంచే ప్రణాళికాబద్ధంగా విద్యాభ్యాసం చేస్తూ నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

38 అంశాలపై కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం





మాట్లాడుతున్న మున్సిపల్ చైర్పర్సన్ కట్టా మంగ, సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు, అధికారులు

- పట్టణాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి
- మున్సిపల్ చైర్పర్సన్ కట్టా మంగ

రేపల్లె: పట్టణ అభివృద్ధిలో ప్రజలందరూ భగస్వాములు కావాలని రేపల్లె మునిసిపాలిటీ చైర్పర్సన్ కట్టా మంగ అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చైర్పర్సన్ అధ్యక్షత వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని ప్రజలకు సూచించారు. పట్టణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం చేశామని తెలిపారు. నిరంతరం డ్రెయిన్లో పూడికను తీయించి, రహదారుల వెంబడి చెత్తను తొలగించేందుకు అధికారులతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చైర్పర్సన్ మంగ పేర్కొన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులతో నిరంతరం సమీక్షలు జరుపుతూ.. స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

అనంతరం ఏజెండాలోని 38 అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా పట్టణ ప్రజలకు కౌన్సిల్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేసింది. ఈ సమావేశంలో వైస్చైర్మన్లు గుజ్జర్లమూడి ప్రశాంత్కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కమిషనర్ విజయసారథి, అధికారులు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా విఖనసాచార్య జయంతి ఉత్సవాలు



ఘనంగా విఖనసాచార్యస్వామి ఊరేగింపు

బాపట్ల: బాపట్ల క్షీర భావన్నారాయణ స్వామి దేవస్థానంలో అత్యంత వైభవంగా విఖనసాచార్య జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. గురువారం అర్చకులు స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. భావన్నారాయణ ఆలయం వెనుక నిర్మించిన భావపురి శ్రీనివాస విఖనస ఆశ్రమంలో స్వామివారి సభ జరిగింది. భావపురి వైఖానస సంఘం ఆధ్వర్యంలో విఖనస స్తోత్ర రత్నావళి పుస్తక ఆవిష్కరణ చేపట్టారు. ఈ సభలో టీటీడీ ఆగమ సలహాదారులు నల్లూరి వెంకట మోహన్రంగాచార్యులు, డాక్టర్ నారాయణరాజు, గోపాలచార్యులు, శ్రీనివాసుల కృష్ణమాచార్యులు, డాక్టర్ ఆర్. రామకృష్ణమాచార్యులు, నారాయణ వరప్రసాద్లను స్వామివారి మెమెంటుతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నారాయణ శేషబాబు, దివి శ్రీనివాసుమూర్తి, విఖనసమహర్షి వైభవాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్వీఎస్ పాంచజన్య, ఎస్.భార్గవ, ఎస్.విఖనస మూర్తి, బి.గోపీచంద్, భార్గవ, సత్యంబాబు, విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజన పథకానికి ఉచితంగా ఆన్లైన్ రిజిస్ట్రేషన్



మాట్లాడుతున్న దిలీప్రాజా

తెనాలి: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకానికి అర్హత గల చేతి వృత్తిదారులకు కామన్ సర్వీస్ సెంటర్తో ఉచితంగా ఆన్లైన్ రిజిస్ట్రేషను చేయించనున్నట్టు సినీ దర్శకుడు, స్వచ్ఛంద సంస్థ పెన్నీ మిని స్ట్రీస్ వ్యవస్థాపకుడు దిలీప్రాజా వెల్లడించారు. స్థానిక రత్న ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేతివృత్తులపై ఆధారపడి జీవించే వారికి ప్రభుత్వం శిక్షణనిస్తుందన్నారు. ఈ సమయంలో రోజుకు రూ.500తో పాటు రూ.15 వేల విలువచేసే పనిముట్లను అందజేస్తుందని తెలిపారు. అనంతరం తొలి విడత రూ.లక్ష (18 నెలలకు తిరిగి చెల్లింపు), రెండో విడత రూ.2 లక్షల (30 నెలలకు తిరిగి చెల్లింపు)ను ఏడాదికి అయిదు శాతం వడ్డీతో రుణం కల్పిస్తుందని చెప్పారు. వడ్రంగి, పడవల తయారీ, కమ్మరి, స్వర్ణకారులు, కుమ్మరి, శిల్పకారులు, చర్మకారులు, చెప్పులు కుట్టేవారు, తాపీ పనిచేసేవారు, బొమ్మల తయారీదారులు, క్షురకులు, రజకులు, దర్జీలు, చేపల వల తయారీదారులకు ఈ పథకం వర్తింస్తుందని ఆయన వివరించారు. ఆసక్తి కలిగినవారు తమ వృత్తి, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్బుక్, ఆధార్కు అనుసంధానమైన ఫోన్ నంబరు ఫొటోస్టాట్ కాపీలను రత్న ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో అందజేయాలని ఆయన కోరారు. ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ఖర్చును తాము భరిస్తామని తెలిపారు. అనంతరం క్యాంప్ నిర్వహించే తేదీని తెలియజేస్తామని చెప్పారు. సమావేశంలో కామన్ సర్వీస్ సెంటర్ ప్రతినిధి దాసరి శివన్నారాయణ, బండ్ల రమణయ్య, అమీర్చౌదరి పాల్గొన్నారు.

మంచి, చెడు స్పర్శలపై అవగాహన అవసరం



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న న్యాయవాది ప్రత్యూష

తెనాలి రూరల్: 18 ఏళ్లలోపు బాలికలు మంచి చెండు స్పర్శలపై అహగాహన కలిగి ఉండాలని న్యాయవాది పేట ప్రత్యూష సూచించారు. స్థానిక కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిర బాలికోన్నత పాఠశాలలో గురువారం మంచి, చెడు స్పర్శలపై అహగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కిశోర బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. యుక్త వయసులో ఉన్న పిల్లలు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ప్రత్యూష మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులే కాకుండా తెలిసిన వారు సైతం బాలికలతో చెడుగా ప్రవర్తించే సందర్భాలు ఉంటాయని తెలిపారు. అలాంటి ఘటన ఎదురైతే వెంటనే సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయంలో లేదా పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. 18 ఏళ్లలోపు కిశోర బాలికలు దేశభక్తి కలిగి ఉండాలని ఆమె తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం మహిళలకు రక్షణ కవచంగా ఉన్న దిశ యాప్ ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివ బసవమ్మ, వీరాంజనేయులు, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది షేక్ మహబూబ్, విద్యార్థినులు పాల్గొన్నారు,

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తపై కేసు నమోదు

కొల్లూరు: భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తపై కేసు నమోదు చేసినట్లు కొల్లూరు పోలీసులు తెలిపారు. కొలకలూరుకు చెందిన చొప్పర శారదమ్మకు (37), కొల్లూరుకు చెందిన స్వాములుతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. భార్యభర్తల నడుమ వివాదం చోటుచేసుకోవడంతో నాలుగేళ్ల క్రితం భర్త స్వాములుపై శారదమ్మ కొల్లూరు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసి, తన ఇద్దరు కొడుకులతో కలసి పుట్టింటికి వెళ్లి, అక్కడే ఉంటోంది. ఇటీవల తన చిన్న మామ మరణించడంతో చూడటానికి రావడంతో స్థానిక పెద్దలు భార్యభర్తలు కలసి ఉండాలని, వివాదాలు జరగకుండా సర్దుబాటు చేస్తామని చెప్పడంతో భర్తతో కలసి ఉంటోంది. ఇరువురి మధ్య మళ్లీ వివాదాలు రావడంతో.. ఈ నెల 29న భర్త స్వాములు భార్యను కొట్టి, ఇంటి నుంచి వెళ్లి పోవాలని దూషించాడు. దీంతో మనస్థాపానికి గురైన శారదమ్మ అదే రోజు ఇంటిలో పురుగు మందు తాగి, ఆత్మహత్యాయత్నం చేసింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను గమనించిన కుమారుడు, బంధువుల సాయంతో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లాడు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్కు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె బుధవారం మృతి చెందింది. వైద్యశాల నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా ఎస్ఐ జి. రాజ్యలక్ష్మి ఆత్మహత్యకు కారణమైన భర్తపై గురువారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.